క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన పార్టీ జిల్లా కార్యదర్శి



గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్ బుధవారం పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి సీతక్కను జిల్లా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆయన వెంట చల్వాయి ఉప సర్పంచ్ తేళ్ల హరిప్రసాద్, జంపాల అనిల్, నారాయణ తదితరులు ఉన్నారు.

ఇసుక క్వారీలను రద్దు చేయాలి



వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం, అయ్యవారిపేట ఇసుక క్వారీలను రద్దు చేయాలని కోరుతూ ఎంపీపీ శ్యామల శారద, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత పేరూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా రేజింగ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆదివాసీలకు ఉపయోగపడేలా ఇసుక క్వారీలు ఉండాలని వారు అన్నారు.

నర్సరీల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



కాటారం: హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీల్లో చేపడుతున్న నర్సరీల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని ప్రతాపగిరిలో ఏర్పాటు చేస్తున్న నర్సరీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. బ్యాగుల ఫిల్లింగ్, వరుసక్రమంలో ఏర్పాటు లాంటి పనులను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. నర్సరీ ఏర్పాటుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీఓ వెంట ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కన్నాయిగూడెం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాన్ని సర్పంచ్ కావిరి పద్మ, మండల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి బియ్యంతో పాటు వంట సరుకులను బుధవారం అందించారు. ఈ సందర్భంగా లస్మయ్య చిత్రపటానికి ఆమె పూల వేసి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, పోలయ్య, బక్కయ్య, వెంకటయ్య, నర్సింహారావు, భిక్షపతి తదితరులు ఉన్నారు.

బర్లగూడెంలో వైద్యశిబిరం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని ఎస్సీ మర్రిగూడెంగ్రామంలో చిన్నారులకు జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఆశ కార్యకర్తలకు ఏఎన్ఎంలకు పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’కు అనూహ్య స్పందన

వాజేడు: ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి మండలంలో అనూహ్య స్పందన కనిపించింది. మండల పరిధిలోని నాగారం, పేరూరు, గుమ్మడి దొడ్డి, చీకుపల్లి గ్రామ పంచాయతీల్లో ఈ ప్రజా పాలన కార్య క్రమాలను బుధవారం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. గుమ్మడి దొడ్డిలో తహసీల్దార్ శ్రీనివాస్, పేరూరులో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, చీకుపల్లిలో ఎంపీడీవో విజయ, నాగారంలో మండల ప్రత్యేకాధికారి సర్ధార్ సింగ్ ఆధ్వర్యంలో టీములు ఐదు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటి వరకు మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో 5977 కుటుంబాలు ఉండగా 6035 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. గుమ్మడి దొడ్డి గ్రామ పంచాయతీలో కార్యక్రమానికి ఎంపీపీ శ్యామల శారద, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను ఇప్పించారు



వాజేడు: దరఖాస్తులు ఇస్తున్న అర్జిదారులు

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల్లో భాగంగా అర్హులైన వారికి పథకాలను వర్తింప చేయడానికి రామన్నగూడెంలో చేపట్టిన ప్రజా పాలనలో ప్రజలు పాల్గొని దరఖాస్తులు చేసుకోవాలని రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం, ఏటూరునాగారం, శివాపురం, అల్లంవారిఘణపురం, చెల్పాక, చిన్నబోయినపల్లి, కోయగూడ ఎల్లాపురం, ముల్లకట్ట, కొండాయి, రొయ్యూర్, శంకరాజుపల్లి, షాపెల్లి గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించగా 2363 వచ్చాయని ఎంపీడీఓ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 8874 దరఖాస్తులు మండల వ్యాప్తంగా వచ్చాయని, మిగతా దరఖాస్తులు 1793 వచ్చినట్లు వెల్లడించారు. దరఖాస్తులను గ్రామాల వారీగా భద్రత పర్చడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సృజన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు సతీష్, సందీప్, పోలరాజు, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సీఏలు, వీఏఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల స్వీకరణ

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్‌లో 204, మల్లూరులో 684, వాగొడ్డు గూడెంలో 386, బోరునర్సాపురంలో 153 దరఖాస్తులను స్వీకరించారు. అదే విధంగా రేషన్ కార్డులు, ఫించన్లు ఇతర పథకాల మంజూరీ కొరకు నాలుగు గ్రామాల్లో 372 మంది నుంచి జనరల్ దరఖాస్తులు వచ్చినట్లు మండల స్పెషలాఫీసర్ తుల రవి తెలిపారు. గ్రామ సభలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఎస్సై గోదరి రవికుమార్, సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ బైరి వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీఓ మమత, ఆర్ఐ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులు వినియోగించుకోవాలి

గోవిందరావుపేట : మండల కేంద్రంలోని మచ్చాపూర్ పాఠశాల ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ రేగూరి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి విజయవంతం చేసేవిధంగా అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లెంకల రమేష్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, జంపాల ప్రభాకర్, వంగరి ప్రభాకర్, నరసయ్య కుమ్మరి కుంట్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎదిర, వెంకటాపురం గ్రామాల్లో గ్రామసభలు



వెంకటాపురం(కె): దరఖాస్తులు అందించేందుకు బారులుదీరిన ప్రజలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర, బర్లగూడెం, సూరవీడు, వెంకటాపురం పంచాయతీల్లో బుధవారం అధికారులు ప్రజా పాలన గ్రామసభలను ఏర్పాటు చేశారు. సభల్లో ప్రజలు దరఖాస్తులు అందజేసేందుకు భారీగా తరలివచ్చారు. వెంకటాపురం మేజర్ పంచాయతీలో ప్రజలనుండి వచ్చే దరఖాస్తులను స్వీకరించేందుకు పది కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. వెంకటాపురం పంచాయతీ లో గ్రామసభకు జెడ్పీటీసీ పాయం రమణ, హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీఓ హనుమంతరావు, విద్యుత్ శాఖ ఏఈ సనీల్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: రామన్నగూడెంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న సర్పంచ్ దొడ్డ కృష్ణ



మంగపేట : మల్లూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



గోవిందరావుపేట : దరఖాస్తు ఎలా నింపాలో వివరిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

అక్షింతలకు హారతులతో స్వాగతం



ములుగు : అక్షింతలకు హారతులతో స్వాగతం పలుకుతున్న జాకారం వాసులు

ములుగు: అయోధ్య శ్రీరాముడి అక్షింతలు బుధవారం రాత్రి ములుగు మండలంలోని జాకారం గ్రామానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా మహిళలు హారతులతో అక్షింతలకు ఆహ్వానం పలికారు. అనంతరం అక్షింతలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడిశెట్టి రమేష్, రాజు వెంకన్న, సంపత్, సాంబయ్య, రాజేందర్, కుమార్, శ్రీను, రజనీ కాంత్, సురేందర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ

మంగపేట: మండలంలోని కమలాపురంలో శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శ్రీరామభక్త బృందం ఇంటింటికీ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీరామ భక్తులు జై శ్రీరామ్ కీర్తనలు చేస్తూ గ్రామంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపుల నివాస గృహాలకు వెళ్లి అక్షింతలను పంపిణీ చేవారు. ఈనెల 22న అక్షింతలను కుటుంబ సభ్యులు తలపై చల్లుకుని అయోధ్య రామ జన్మభూమిలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తు శ్రీరాముడు, హనుమాన్ కీర్తనలు ఆలపించి శ్రీరాముని కృపకు పాత్రులు కావాలని వివరించారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త బృందం సభ్యులు వెంకట్‌రెడ్డి, శంకర్, యాదగిరి, జగదీష్, లక్ష్మణ్‌రావు, సాంబయ్య, రేణుక, కవిత, చంద్రకళ, ఉమా, శిరీష, రమ, కవిత తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తిమ్మంపేటకు చేరిన శ్రీరాములని అక్షింతలను గ్రామస్తులు, భక్తులు అ త్యంత భక్తి శ్రద్ధలతో మంగళ వాయిద్యాల నడుమ నడుమ బుధవారం రాత్రి ఊరేగింపుగా రామాలయానికి చేర్చారు. అయోధ్య రామజన్మభూమిలో జనవరి 22న అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిలకమర్రి రాజేందర్, ఆకసతీష్, పాపక వెంకన్న, శానం సత్యం, దంతెనపెల్లి నరెందర్, శ్రీనివాస్, పూజారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మంగపేట : అక్షింతలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీరాముని భక్త బృందం

జాతరకు నిధులు విడుదల చేయాలి

కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్ సమ్మక్క సారలమ్మ, మినీ జాతరకు ప్రభుత్వం నిధులు విడదల చేయాలని యువజన సంఘం నాయకులు ఆలెం నాగేష్ అన్నారు. మండలంలోని ఐలాపూర్‌లో పూర్వం నుంచి జరుగుతున్న జాతరకు ప్రభుత్వాలు సరైన నిధులు ఇవ్వక వసతులు కరువయ్యాయని అన్నారు. జాతీరకు సుదూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు సమర్పించారుకుంటారు. మేడారం మహాజాతర అనంతరం ఐలాపూర్‌లో శుంకుతీర్థం జరుపుతారని దానికి కోసం పలు అభివృద్ధి కింద నిధులు విడుదల చేయాలి కోరారు. ఇందులో ఐలాపూర్‌లోని ఆశ్రమ పాఠశాల నుంచి గుడి ప్రాంగణం వరకు రోడ్డు మరమ్మతులు, గుడి ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు, దేవాలయాల అలంకరణ, మేడారం వచ్చిన భక్తులు తిరిగి భూపాలపల్లి జిల్లాలోని రెడ్డిగూడెం నుంచి నేరుగా ఐలాపూర్ వచ్చుటకు రోడ్డు వసతి, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ లైటింగ్ తదితర వసతులకు నిధులు విడుదల చేయాలని తెలిపారు.

చికిత్స పొందుతున్న ఎంపీడీఓ మృతి



శ్రీధర్(ఫైల్)

మంగపేట: నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న స్థానిక ఎంపీడీఓ కర్నాటి శ్రీధర్ (55) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్ 2021 ఆగస్టు 04 నుంచి ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఈనెల 31న రాత్రి గుండెపోటు రావడంతో అతని భార్య సీపీఆర్‌చేసి స్థానికుల సాయంతో 108లో ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి త్వరితగతిన ఏదైనా పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే ఆరెపల్లిలోని ఎస్ఎస్ఆర్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో బాత్‌రూంకు అని వెళ్లి కుప్పకూలి పోయాడు. వెంటనే పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమార్తె అమెరికాలో ఉంది. పార్థివదేహాన్ని ఖమ్మంలోని మమత ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఎంపీడీఓ మృతికి అధికారులు, సిబ్బంది సంతాపం

ఎంపీడీఓ అకాల మృతి పట్ల మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఎంపీఓ మమత, సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ నాగేందర్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ.సఫియా సుల్తానా, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పల్లె ప్రకృతి వనానికి రక్షణ కరువు

కన్నాయిగూడెం: మండలంలోని పల్లె ప్రకృతి వనాలకు రక్షణ లేకుండా పోయింది. రక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని లక్ష్మీపురం పల్లెపకృతి వనంలో గేదెలు చొరబడి మేస్తున్న సంఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీలో బుధవారం చోటు చేసుకుంది. గేదెలు చొరబడి పకృతి వనం పాడు చేస్తు మేస్తుండగా గ్రామ ప్రజలు చూసి పంచాయతీ అధికారులు ప్రభుత్వం పల్లె ప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులను గాలికి వదిలేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవతీసుకొని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రకృతి వనంలో మేతమేస్తున్న గేదెలు

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



మంగపేట : సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఏటూరునాగారం : సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


- టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు

ఏటూరునాగారం: ప్రతి మహిళా సామజిక విప్లవకారిణి అయిన సావిత్రి బాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీపీటీఎఫ్ మండల కన్వీనర్ భూక్యా సారంగపాణి ఆధ్వర్యంలో పూలే 193 వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేశారు. పల్లె నాగరాజు మాట్లాడుతూ పూలే తొమ్మిదేళ్ల వయసులోనే సామజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలేను వివాహమాడిందన్నారు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లో అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. జీవితంలో తనకు ఎన్ని అవమానాలు ఎదురైనా జీవితాంతం మహిళాల చదువుకోసం పాటు పడిందన్నారు. నేటి సమాజంలో ప్రతి మహిళ సావిత్రి బాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఏ సమ్మక్క, అంగన్‌వాడీ టీచర్స్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి ములుగు జిల్లా ఇన్‌చార్జ్ నెగరకంటి సురేష్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వావిలాల స్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, తిప్పనపల్లి సుదర్శన్, పరికి శ్రీని వాస్, చిట్టిమళ్ళ సమ్మయ్య, రాంబాబు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: స్త్రీ విద్య కోసం విశేష కృషి చేసి సమాజాన్ని మార్చిన ధీరవనిత, తొలితరం మహిళా ఉద్యమకారిణి చదువుల తల్లి సావిత్రీబాయి పూలే అని పలువురు వక్తలు అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో పూలే 193వ జయంతి వేడుకలు అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలతో సత్కరించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, రాజారత్నం, హరికృష్ణ, బీసీ నాయకులు ఆది నారాయణ, ఎస్టీ నాయకులు యానయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు వీరస్వామి, నరేష్, సంపత్, రాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కాటారం : మండల కేంద్రంలోని గారెపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలోని సామగ్రి కాలిపోయిన సంఘటన బుధవారం చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే..నడిగోట దేవేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గారెపల్లిలోని మహదేవపూర్ రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఉదయం దేవేందర్, ఆయన కుటుంబ సభ్యులు కూలీ పనుల నిమిత్తం వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ నెలకొని మంటలు చెలరేగాయి. ఇంట్లోని వంట సామగ్రి, దుస్తులు, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పారు. రూ.50వేల మేర నష్టం జరిగినట్లు ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకున్నారు.



కాలిపోయిన ఇంటి సామగ్రి

నూతన సంవత్సరంలో అన్ని విజయాలే కలగాలి

మొగుళ్లపల్లి: 2024 నూతన సంవత్సరంలో ప్రజలందరికీ, విద్యుత్ ఉద్యోగులకు, రైతులకు అన్ని విజయాలే కలగాలని ట్రాన్స్‌కో ఏఈ ప్రమోద్ ఆకాంక్షించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో బుధవారం మండలంలో పనిచేసే విద్యుత్ ఉద్యోగులు బుధవారం ఏఈ ప్రమోద్, సబ్ ఇంజినీర్ హరీష్‌లకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫోర్ మెన్ యాదగిరి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు జక్కు రాజేందర్ గౌడ్, శ్రీనివాస్, రఘు, జేఎల్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సేవిస్తే జీవితం నాశనం

కాళేశ్వరం: డ్రగ్స్ సేవిస్తే జీవితం సర్వనాశనం అవుతుందని కాళేశ్వరం ఎస్సై జే.లక్ష్మణ్‌రావు అన్నారు. ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయి లాంటి వ్యసనాలకు అలవాటు పడద్దని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

వెంకటేశ్వర్లపల్లిలో కార్డన్ సెర్చ్


రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని బానోతు మొగిలి, బోడ రాజ్యలక్ష్మీ, బోడ రవి వద్ద సుమారు 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గుడుంబా, గంజాయి నిర్మూలన, సైబర్‌నేరాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీఐ వేణుచందర్, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సాంబమూర్తి, శ్రీధర్, రమేష్ , పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాములు

ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అజీరాబేగం

మొగుళ్లపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి అజీ రాబేగం ఉత్తమ కార్యదర్శిగా సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండి ప్రజలకు సేవ చేస్తుందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శిని మెమొంటో, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంతల రాజేందర్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు